## సిలికాన్ వేలీలో అన్నమయ్య





ఈ సంకీర్తనోత్సవానికి శ్రీమతి హేమ కోట, వైజయంతి సుసర్ల నేతృత్వం వహించారు. వారి సారథ్యంలో సిలికానాంధ్ర కార్యకర్తలు అహోరాత్రులూ శ్రమించి 318 మంది కళాకారులు పాడేందుకు అనువైన వాతావరణం కల్పించారు. ఎంతో శ్రద్ధతో బ్యాక్‌డ్రాపు తయారు చేసి సభా వేదికను అందంగా తీర్చిదిద్దారు కార్యకర్తలు. శ్రీహరి శాస్త్రి, శ్రీలక్ష్మి కోలవెన్ను, గాయత్రి అవ్వారి లు కృతులను పలుమంది ఆలాపించడానికి, గోష్ఠిగానానికి విశేష సాయమందించారు. శ్రీలక్ష్మి కోలవెన్ను కృషికి గుర్తింపుగా దుశ్శాలువతో, మకుటంతో సత్కరించారు. కార్యక్రమం ఆసాంతమూ పెద్ద తెరపై కృతుల వివరాలను, పాడేవారిని దగ్గరగా చూపించడం అదనపు ఆకర్షణ. వంశీ నాదెళ్ళ, నారాయణ రాజులు సాంతమూ వీడియో విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహించి మన్ననలందుకున్నారు.

నాటి సాయంకాలం భారతదేశం నుండి అన్నమాచార్య ప్రాజెక్టు నిర్దేశకులు మేడసాని మోహన్ దూరవాణిలో తమ సందేశాన్ని వినిపించారు. 'సిలికానాంధ్ర తపనవల్లే అనేక అసామాన్య విజయాలు లభిస్తున్నాయని తెలిపారు. అందుకు కొనసాగింపుగానే సుమారు 150 అన్నమయ్య కృతులకు స్వరకల్పన చేసే బాధ్యత సిలికానాంధ్రకు అందిస్తున్నామ'ని అన్నారు. కూచిభొట్ల ఆనంద్ ప్రసంగిస్తూ, అఖిల భారత అన్నమాచార్య ఉత్సవానికి దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తోందని, అనేక ఊళ్ళలో ఇప్పటికే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రతి జిల్లాకు రెండు కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు.

